# హాకీ విషాదయోగం

పొద్దున్నే మొద్దునిద్దరోయే మారాజు, పేపరు మొహానికడ్డంపెట్టుకుని రేడియోకేసి చూస్తూ బిక్కమొహం వేసుగుని కూర్చున్నారు, సైలెంటు పిక్చర్లోలా మాటామంతీలేకుండా—పైన కప్పుసరిగ్గానేవుంది. కుర్చీక్రింద చూశా— ఎంగిలి కాఫీగ్లాసుతప్ప మరేం కనపడలే. టేబిల్‌మీద దుర్వార్తలేమైనా వున్నాయేమోనని కెలికితే అక్కడట్లాటి ఉత్తరాలేం లేవు. మరెందుకబ్బా ఈ మొనగాడు యిలా చింతపండు ముద్దలా, ఆరెయ్యాని తడిబట్టల మోపులా, చలనం లేకుండా ముడిచిపెట్టుకు కూర్చోడం, అని బిత్తరపోయి కుర్చీ కొంచెం కదిపి చూశా. లాభంలే— నా దగ్గరో ఫైవుంది. దాంట్లో చెరిసహం.... అహ్హా! కాదు పోనీ మీకు ఫోర్ ఢపీస్ కావాలా (మళ్ళీ యిచ్చేద్దురుగాని) డోంట్ వర్రీ అన్నా చైతన్యంలేదు.

వ్హాట్ సార్! అంబరిల్లా పారేసుకున్నారా— పోతేపోయిందిలెండి అని కొంచెం బిగ్గరగా కేకేశా. పోతే పోయిందంటావే రాస్కెల్ అంటూ లేచారు. వే. గి. అనకండి. కీప్ యువర్ రెస్పెక్టు, టేక్ అండ్ గివ్. "ఒసే గిసే" అంటే వూరుకొనేదిలేదు. "ఏమే గీమే" అన్నా, నేనూరుకోను. ఐ వాంట్ అపాలజీ ఇన్‌రైటింగ్ బావగారూ— అన్నా, అప్పుడు మునీశ్వరుళ్ళా కళ్ళుతెరచి (అఫ్‌కోర్సు గడ్డం లేదనుకోండి) ఏవిటే ఈ డర్టీ గోల.... అని అయోమయంగా చూశారు యిది మనిల్లేనా అన్నంత అనుమానంగా. బట్ "టే" ఐ డోంట్ లైక్.... ఫస్టు విత్‌డ్రా ఆల్ అన్ పార్లమెంటరీ లాంగ్వేజి అని యాంగ్రీగా చిన్న మైల్డు అటాక్ ఇచ్చా.

కుర్చీలోంచి లేచారు— బుష్‌షర్టూ శాండల్సు తెచ్చి ముందుంచా— ఎలాగూ యింట్లోంచి లేచిపోయేట్లున్నాడీ మహానుభావుడు, మనమర్యాద ఎందుకు చెడగొట్టుకోడం అని "ఫిల్టర్లో డికాషనుంది, అది కాస్త కలిపి పట్టుకొస్తా" అని లేచా. చెయ్యిపుచ్చుగులాగారు. జబ్బ వూడొచ్చేదే నేను బ్యాలెన్సు ఆఫ్ పవర్ మెయింటైన్ చేయకపోతే. "మీరవద్దావే" అన్నారు. ఆ "వే" అండర్‌లైన్‌చెయ్యండి. అని దులుపుకుని "వాటీజ్ రాంగ్ విత్యూ?" అని సూటిగా ప్రశ్నించా.

ది క్యాట్ యీజ్ నాట్ అవుటాఫ్ ది బ్యాగ్ (పిల్లి సంచిలోంచి బైటపడలేదు) గట్టిగా చీదారు. ముక్కు ఎర్రగావుంది. కళ్ళు వాచి ఉన్నాయి. (మొగుడిచేత చీవాట్లుతిన్నప్పుడు మనం బెడ్రూంలో ఏడుస్తాం మే, ఎగ్జాట్లీ అలా వుబ్బిపోయున్నాయి) వై డు యు క్రయి? నేనే వన్నా చేశాననుకుంటారు మీ చుట్టాలిప్పుడు వస్తే, మాట్లాడరే (స్పీక వుట్ మాన్) నేనసలే సరైనదాన్నికాను. నాకు తిక్కెత్తుకొచ్చిందంటే నేనూ ఏడుస్తా.

ఇప్పుడెవరు ఏడ్చి ఏం లాభం లేదే. అంతా అయిపోయింది. నాశనం! సర్వనాశనం అంటూ అదేదో డ్రామాలోలా పోజుపెట్టారు. ఏవిటి సార్, మనవాళ్ళు అంటే పెద్దలు చెప్పినట్లు నిండుకుండలా వుండాలిగాని, బెంబేలు పడిపోయి మీరు కంగారుపడి మమ్మల్ని కంగారుపెడితే ఎలాగ చెప్పండి. రానున్నది రాకమానదు. కానున్నది కాకమానదు. పోయేదాన్ని మనం పట్టుకు ఆపగలమూ— మీ విచారం చూస్తోంటే నాకూ ఏడుపొస్తోంది. మీరూ క్రయి నేనూ క్రయి అయితే మన్ని ఓదార్చేవారెవరూ. కాస్త ఆలోచించి ముక్కు ఎగబీల్చండి, ఉండండుండండి— తువ్వాలు తెస్తా పంచెతో ముక్కు తుడవకండి. పంచెలో చీత్తే పంచ మహాపాతకాలు అన్నారు.

యు మస్టు బీయే స్థితప్రజ్ఞా. సుఖంకానీ దుఃఖంకానీ కష్టంకానీ నష్టంకానీ మిమ్మల్నేం చేయకూడదు. మనం నిమిత్తమాత్రులం. పుష్

అంటే ఎగిరిపోతాం. ఎంతెంతవాళ్ళో అలాఎగిరిపోయారు. మనవెంత? మీరు నాపేషన్స్ టెస్టు చేస్తున్నారు. అర్జునుడికి శ్రీకృష్ణుడు గీతబోధించినట్లు మీకు నేను చెప్పవలసివస్తోంది. నా గీత అలావుంది. మీ గీతెలా వుందో.... ఆ పేపరు మొహంమీంచి తియ్యండి. అలా మొహంమీద పత్రిక కప్పుకుకూర్చుంటే మీ మొహం న్యూస్ప్రింటు వాసనకొడుతుంది. పొద్దున్న లేస్తూ అరడజను ఇడ్లీలు కారప్పొడుంతో పట్టిస్తేనేకాని యిటూ అటూ చూడని, మాట్లాడని వ్యక్తి మీరిలాగ విషాదయోగంలోపడి కొట్టుకుంటూంటే నాకుమటుకు ఇడ్లీలు దోసెలు ఎలా సయిస్తాయి చెప్పండి. కళ్ళు తిరుగుతున్నాయి. నా స్పీచ్ విన్నారుకదా— మాట్లాడరే? మౌనముద్ర పట్టానంటారా. గిల్లితే మవునం గివునం జలుబొదిలిపోతుంది— నాకు గోళ్ళుకూడా వున్నాయి. చిదిమిన పాల్గారు చెక్కుటద్దములవాడు! అంటారుగదా— ఏవండీ చిదిమితే పాలుకారకపోతే చెక్కుటద్దములవాడు కాడా? చెక్కుటద్దములు, ఏ సమాసమండి? మీకు తెలుగు రాదా? నాకూ రాదు ఫరవాలేదులెండి. చెక్కుటద్దములు, గడ్డాలు మీసాలూ వచ్చాక ఎలావుంటాయి? చిన్నప్పుడు చెక్కుటద్దములున్న చిదిమితే పాలుకారితే, వేసంకాలంలో చెక్కుటద్దాల్ని చిదిమి ఆడాళ్ళు కాఫీలు, టీలు. కోకోలు పెట్టకపోయారా అంట!

అంతా మనవాళ్ళు ఎగ్జాజరేషన్ అనగా అతిశయోక్తి చేస్తారు. లీవిట్— అయ్యో ఏవిటి ఏెక్కుతున్నారు? ఏడువకండేడువకండి — మీ బాధలు మీ గాథలు....ఛప్ నోరుముయ్-వై షు డై? ఆస్ట్రేలియా అంటున్నారేవిటి? మాప్వేసి పట్టుకురమ్మన్నారా ఆఫీసులో.... అబ్బ అదికాదే ఏది కాదు? ఏహాకీ హాకి ఏవిటి కాకిలాగ. హాకీ ఎందుకు నా మాట విని కాకీపేంటు కుట్టించుకోండి. హాకీపోయిందా పోయిందీ? పోదూ.... అన్నట్లు మీ సొమ్మెం పోయింది? ఇంకా ఏదో కొంపములిగిపోయిందనుకున్నాను, అన్నా. ఆర్డినరీ ఆడదాన్ని ఎంతెలా హడలగొట్టి చంపేశారు. ఆటలో అర్టిపండు .... మనవాళ్ళా.... మనవాళ్ళేమిటి— పరాయివాళ్ళే

మిటి? "నీవూ నేనను భేదబుద్ధి ఇహమందేకాని ఆ భూగర్భరత్నావాసం బున లేదు" అన్నాడు జాషువాకవి. మరి ఆడ్డం అన్నాక పోవడానికి గెలవడానికీ కాక అస్తమానూ గెలవడానికి అనుకున్నారా? ఎంతాశ.... రేడియోలో విన్నారూ న్యూస్.... చాపుకబురు చల్లగా చెప్పడానికింత హడావిడెందుకు? వూరుకోండి నా మాటవిని— మీకేమన్నా హాకీ బ్చ్చా పాడా— పేపరుచదివి బుజాలెగరెయ్యడమేకదా యింట్లోకూర్చుని, మన వాళ్లకు శుద్ధషవరమయిందంటారా-కానివ్వండి "పడ్డవారికిచేటు వాటిల్లదెపుడు" అన్నారుకదా పెద్దలు. ఆస్ట్రేలియాలో ఓడిపోయారని మీకు బెంగెందుకు? తలఎత్తుకుతిరగలేమంటారా- ఇదివరకు మనవాళ్ళచేతుల్లో ఓడిపోయినవాళ్ళందరి ఫీలింగ్సూ ఎలావుంటాయో మీకిప్పుడు తెలిసొచ్చింది కదా.

ఇటీజ్ ఎ లెసన్.... ఇవాళ ఓడిపోతారు రేపు గెలుస్తారు....పాకిస్తాన్ చేతిలో ఓడిపోయినా బాగుండేదంటారా.... పోన్లెస్తురూ ఆ ఆస్ట్రేలియా వాళ్లే పడతారు ఆ బాధ.... మీకెందుకు నాకెందుకు? ఇంతిలాతెలిసినవారు ముంగిలా కూర్చుని మీలో మీరు కుళ్లిపోవడం ఎందుకూ అంట? ఆటలసంగతి నీకేం తెలుసే పిచ్చిమొద్దూ అంటారా అనండి. అనండి. ఉడుకుమోతుతనంగా వుంటే మీకు వుడుకుడుకు గారెలు చేసిపెడతాను. తిందురుగాని. అయితే మీకీ హాకీ విషాదయోగం వదల్దా? ఎన్నాళ్ళుంటుంది? అలాక్కాదు. తలంటోస్తాను రండి. తలంటుకుంటే ఆ బుర్రలోని కుళ్ళంతా (ఐ మీన్ మీ బుర్రలో కుళ్ళుందనికాదు. అది బంగారవే అనుకోండి) కొట్టుకుపోతుంది. నా ఉద్దేశం మీవాళ్ళ హాకీజాతకాలు బాగులేవనికాదు. పైవాళ్ళ జాతకాలు'బాగున్నాయని, మీ రోనక్కను తీసుకుని వాళ్ళకెదురు వెళ్లి ఆ నక్కను వాళ్ళచేత తొక్కించాల్సింది. ఇదివరకు వరల్డంతా హాకీని కాకిని చూసినట్టుచూసేరు. అస్తమానూ మీ వాళ్లే నెగ్గేస్తూంటే, ఇదేదో నెమిలి అనుకొని వాళ్ళూ వెంటబడ్డారు. మన ఆట పాడైపోయి మనం ఓడిపోయామని అనుకోడంకంటె వాళ్ళందరూ

ఇంప్రూవుచేసి మన పీకలమీద కత్తినూరి యివ్వాళ్టికిప్పుడు కసిక్కున కోడిని కోసినట్టు పీక తెగ్గోసేరు, అని అంటే మీకు తృప్తిగా వుండేట్లుంది.

ఏంచేస్తాం-హాకీ కోడి పీక ఆస్ట్రేలియా కసిక్కున కోసింది. ఇది ఇండియాకు హాకీ విషాదయోగం-పాకిస్తాన్‌కు విశ్వరూప సందర్శనయోగం.... అబ్బో ఆ మాత్రం నేనూ చెప్పగల్ను. లేవండి తువ్వాలు చుట్టుగు ఒంటికి నూనె రాసుకోండి- సూర్యుడు మీదిమీదికొస్తున్నాడు పొగరుమోతల్లే.... గెటప్ లేస్తారా నన్నొచ్చి గిల్లమంటారా?

తలంటే జ్ ది బెస్ట్ రెమిడీ ఫరాల్ సారో హీరోస్: